
సాక్షి
కర్నూలు
గురువారం : 26 : జనవరి : 2023



దేవస్థానం పథకాలకు విరాళం

శ్రీశైలంటెంపుల్: గోసంరక్షణ నిధికి హైదరాబాద్‌కు చెందిన దివ్యశ్రవణ్‌కుమార్ రూ.లక్ష, అన్నప్రసాద పథకానికి విశాఖపట్నానికి చెందిన చొప్పకట్ల సుబ్రహ్మణ్యం రూ.లక్ష విరాళంగా ఇచ్చారు.



సాక్షిగణపతికి పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థం శ్రీశైలమహాక్షేత్రంలో బుధవారం సాక్షిగణపతిస్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,618.19
టీఎంసీల సామర్థ్యం	: 105,788
ప్రస్తుతం	: 56,399
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,173

న్యూస్‌రీల్

రాష్ట్ర భూగర్భ జలగణన శాఖ డైరెక్టర్‌గా జాన్ సత్యరాజు

- స్వగ్రామం చాగలమర్రి మండలం మల్లెవేముల



కర్నూలు(అగ్రికల్చర్): చాగలమర్రి మండలం మల్లెవేముల గ్రామానికి చెందిన ముద్దాసు జాన్ సత్యరాజు రాష్ట్ర భూగర్భ జల గణన శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న ఆయన ఇప్పటికే పూర్తి అదనపు బాధ్యతలతో డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం జేడీ స్థాయి నుంచి డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. సత్యరాజు 1991లో నంద్యాలలో అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్‌గా ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ డైరెక్టర్ స్థాయికి చేరడం విశేషం.

ముందస్తుగా ఫీజు వసూలు చేస్తే బ్లాక్ లిస్ట్‌లో పెడతాం

- జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎస్‌పీఎస్‌ఎన్ రెడ్డి

కర్నూలు(అర్బన్): జగనన్న విద్యా దీవెన విడుదలవుతున్న విద్యార్థుల నుంచి ముందస్తుగా ఫీజును వసూలు చేస్తున్న ప్రైవేటు కళాశాలలను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎస్‌పీఎస్‌ఎన్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగానే ప్రతి ఆర్థిక సంవత్సరంలో విద్యా దీవెన కింద నిధులను తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. అయితే కొన్ని కళాశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులు ఫీజులు చెల్లించిన అనంతరం వాపస్ చేస్తామని చెబుతూ ముందుగానే డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ముఖ్యంగా ఆదోని డివిజన్‌లోని పలు కళాశాలలు విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేస్తున్నాయన్నారు. ఈ పద్ధతిని మార్చుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మరో 13 పశు ఆరోగ్య సేవా రథాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాకు మరో 13 వైఎస్సార్ ఆరోగ్య సేవా రథాలు వచ్చాయి. ఇవి గురువారం నుంచి సేవలు అందించనున్నాయి. మొదటి విడతలో కర్నూలు జిల్లాకు 7, నంద్యాల జిల్లాకు 7 చొప్పున మంజూరు చేశారు. టోల్‌ఫ్రీ నంబరు 1962కు కాల్ చేస్తే ఇవి సత్వరమే రంగంలోకి దిగి వైద్య సేవలు అందిస్తున్నాయి. తాజాగా కర్నూలు జిల్లాకు 6, నంద్యాల జిల్లాకు 7 ప్రకారం వచ్చాయి. కొత్త వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాలను బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం దగ్గర పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కొత్త వెటర్నరీ మొబైల్ క్లినిక్‌లు గురువారం ఉదయం సంబంధిత నియోజకవర్గానికి చేరుకుంటాయి. వీటిని స్థానిక ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారు.

నేటి నుంచి కర్నూలులో ప్లాస్టిక్ నిషేధం

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుంచి కర్నూలు నగరంలో ప్లాస్టిక్ నిషేధం మరింత పక్కాగా అమలు చేయనున్నారు. ఇందుకోసం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ టీములను ఏర్పాటు చేశారు. నగరంలో 17 శానిటేషన్ డివిజన్లు ఉండగా రెండు టీములను నియమించారు. ఒకటి నుంచి తొమ్మిదవ శానిటేషన్ డివిజన్ వరకు నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి నేతృత్వంలో తొమ్మిది మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పనిచేయనున్నారు. అలాగే 10 నుంచి 17వ డివిజన్ వరకు శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు నేతృత్వంలో 8 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయనున్నారు. నిషేధంలో ఉన్న ప్లాస్టిక్‌ను విక్రయిస్తే సంబంధిత షాపుల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయనున్నారు.



కర్నూలులోని పోలీస్ పరేడ్ మైదానంలో గణతంత్ర వేడుకలకు ముస్తాబు చేసిన వేదిక

రిపబ్లిక్ డే.. ప్రపంచ దేశాల సరసన భారతదేశం సగర్వంగా తల ఎత్తుకున్న రోజు.. సమున్నత లక్ష్యంతో రాజ్యాంగం అమలులోకి వచ్చిన పర్వదినం.. ప్రగతి ఫలాలు ప్రతి ఒక్కరూ అనుభవించేలా హక్కు దీపమై వెలిగిన శుభదినం.



కవాతు కోసం సిద్ధమైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

- రాజ్యాంగ రచనకు సర్దార్ నాగప్ప సహకారం
- కర్నూలులో ఆయన పేరు మీద వెలసిన వీధి
- నేడు గణతంత్ర దినోత్సవం
- వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ దీపకాంతుల్లో లోకాయుక్త కార్యాలయం

త్రివర్ణ శోభితం

కర్నూలు(సెంట్రల్): గణతంత్ర వేడుకలకు ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల జెండాలతో మెరిసిపోతున్నాయి. విద్యుత్ దీప కాంతులతో వెలుగులీనుతున్నాయి. కర్నూలు నగరంలోని లోకాయుక్త కార్యాలయం సరికొత్త శోభను సంతరించుకుంది. త్రివర్ణ రంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ) కార్యాలయాన్ని గణతంత్ర వేడుకలకు సిద్ధం చేశారు. గురువారం లోకాయుక్తలో చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి, హెచ్‌ఆర్‌సీలో చైర్మన్ మంధాత సీతారామశాస్త్రి జాతీయ పతకాలను ఆవిష్కరించి, సందేశాలు ఇవ్వనున్నారు.

గణతంత్ర స్ఫూర్తి.. స్వరాజ్య దీప్తి

తెల్ల దొరల పాలనలో ప్రజలకు హక్కులు లేవు.. స్వేచ్ఛ లేదు.. ఎవరైనా ఎదురుతిరిగితే కఠిన శిక్షలు అమలు చేసేవారు..తీవ్ర నిర్బంధాలను సైతం లెక్క చేయకుండా ఎందరో మహనీయులు పోరాటాలు చేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించారు. వారి త్యాగ ఫలితంగా 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1949 నవంబర్ 16న ఆమోదం పొందిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చింది. నాటి నుంచి సర్వసత్తాక సార్వభౌమాధికారంతో మన పాలనను మనమే రాజ్యాంగ బద్ధంగా చేసుకుంటున్నాం. రాజ్యాంగం కల్పించిన హక్కులతో ఎన్నో ఫలాలు పొందుతూ అభివృద్ధి దిశగా దూసుకెళ్తున్నాం.స్వేచ్ఛగా జీవనం సాగిస్తున్నాం. గురువారం భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

కర్నూలు కల్చరల్: బ్రిటీష్ వారి దాస్య శృంఖలాల నుంచి మాతృ భూమిని విడిపించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా వీరులు అవిశ్రాంత పోరాటం చేశారు. జైలు శిక్షలకు వెరవక ఉద్యమమే ఊపిరిగా కదంతొక్కారు. వందే మాతరం అంటూ గర్జిస్తూ తెల్ల దొరలను గజగజ వణికించారు. తుపాకీ తూటాలకు సైతం లెక్క చేయక స్వాతంత్ర్యమే లక్ష్యంగా కదిలారు. పోరాట స్ఫూర్తిని కనబరిచారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, ముత్తుకూరు గౌడప్ప, బియాబాని, గులాం రసూల్‌ఖాన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, వనం శంకర శర్మ, నివర్తి వెంకట సుబ్బయ్య, టి. చిదంబరం, ఆర్‌కే రామ్, గామాగో, చిదంబరం, మేడం వెంకయ్యశెట్టి, ఖాదర్‌బాద్ నరసింగరావు.. స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను అర్పించారు. గాడిచర్ల సంపాదకత్వంలో విజయభేరి, ప్రేమ, తుంగభద్ర, దక్కన్ వైశ్య, మాణిక్య ప్రభు, ఉపాధ్యాయ, భద్రవాణి లాంటి పత్రికలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వెలువడుతూ ప్రజలను చైతన్య వంతులను చేశాయి. శంకరనారాయణ భజన మందిరం, హిందూ, మహమ్మదీయ సంఘం, యూనియన్ క్లబ్, దేశాభిమాని సభ లాంటి సంస్థలు ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష పెరగడానికి, ఉద్యమం వైపు అడుగులు వేయడానికి ఎంతగానో కృషి చేశాయి. స్వాతంత్ర్యం సిద్ధించడంలో కీలకపాత్ర పోషించాయి.

భారత రాజ్యాంగ నిర్మాణంలో కర్నూలు జిల్లా వాసి

కర్నూలు కొండారెడ్డి బురుజు వెనక వీధిలో నివసించిన సర్దార్ నాగప్ప, అమరావతమ్మ దంపతులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. జైలు జీవితం గడిపిన వీరు వందే మాతర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. భారత దేశానికి లిఖిత రాజ్యాంగం ఏర్పడేదాక తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి వైస్రాయి భారతీయులను ఆహ్వానించాడు. నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. 1946లో భారత రాజ్యాంగ చట్టాన్ని తయారు చేయడానికి రాజ్యాంగ సభకు ఎన్నికలు జరిగాయి. కర్నూలు నగరానికి చెందిన సర్దార్ నాగప్ప దీనికి ఎన్నికయ్యారు. డాక్టర్ అంబేద్కర్ నాయకత్వంలో భారత రాజ్యాంగ రచనలో భాగంగా తొమ్మిది మంది సభ్యులతో ముసాయిదా కమిటీ వేశారు. నాగప్ప ఈ ముఖ్యమైన కమిటీలో కూడా సభ్యునిగా ఉండి రాజ్యాంగ రచనలో తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వర్తించారు. స్వాతంత్ర్య ఉద్యమం, భారత రాజ్యాంగ రచనలో కీలకంగా వ్యవహరించిన సర్దార్ నాగప్ప నివసించిన వీధికి ఆయన పేరు పెట్టారు.



సర్దార్ నాగప్ప, అమరావతమ్మ దంపతులు (ఫైల్)

700 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

కర్నూలు (సెంట్రల్): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న 700 మంది ఉద్యోగులకు ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలను ఇచ్చేందుకు నిర్ణయించారు. ఈ మేరకు శాఖల వారీగా పంపిన జాబితాలను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆమోదించారు. వీరికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగే వేడుకల్లో ప్రశంసాపత్రాలను అందజేస్తారు. ఫోన్ల ద్వారా సమాచారం అందుకున్న వారు గురువారం ఉదయం 8 గంటలకే కర్నూలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్ చేరుకోవాల్సి ఉంటుంది.

పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబు



ప్రదర్శనకు సిద్ధంగా ఉంచిన మోటారు సైకిళ్లు

కర్నూలు: గణతంత్ర వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌ను తీర్చిదిద్దారు. గురువారం ఇక్కడ జాతీయజెండా ఆవిష్కరణ చేయనున్నారు. మైదానాన్ని రంగుల జెండాలతో అలంకరించారు. ప్రజాప్రతినిధులు, వీఐపీలు కూర్చునేందుకు వేదికలు ఏర్పాటు చేశారు. నగర ప్రముఖులు, విద్యార్థులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరవుతున్నందున వేదికకు అన్ని వైపులా నీడ ఉండే విధంగా షామియానాలు వేశారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సన్మానించేందుకు ఆహ్వానాలు పంపారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా ప్రగతిని చాటేలా శకటాల ప్రదర్శన, స్టాళ్లను ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించనున్నారు. వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నగరంలోని ప్రముఖ ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

గణతంత్రం వచ్చిన రోజే ఓటు హక్కు పొందాం



మన గణ తంత్ర వ్యవస్థ ప్రపంచానికి ఎన్నో నూతన ఆదర్శాలను చూపించింది. 299 మందితో కలిసి తయారు చేసిన భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ఈ సుదినం 74 వసంతాలు పూర్తి చేసుకుంది. జిల్లాకు చెందిన సర్దార్ నాగప్ప రాజ్యాంగ సభ, ప్రొవిజినల్ పార్లమెంట్‌లో సభ్యుడుగా ఉన్నారు. పదో తరగతే చదివిన ఆయన భారత రాజ్యాంగా నిర్మణ చర్చలో ఎస్సీ రిజర్వేషన్ల గురించి సుదీర్ఘంగా చర్చించారు. గణతంత్రం అమల్లోకి వచ్చిన రోజే జాతి, మత, కుల, వర్గ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిన మొదటి దేశం భారత దేశం. కేవలం ఒక్క సంవత్సర కాల వ్యవధిలోనే ఎన్నికల వ్యవస్థ ఏర్పడి మొదటి సాధారణ ఎన్నికలు నిర్వహించుకోవడం చాలా గొప్ప పరిణామం. 1952 వరకు దేశంలో కలెక్టర్లే జాతీయ పతాకాన్ని ఎగురవేసేవారు. ఆ తరువాత స్వాతంత్ర్యం దినోత్సవం రోజున మంత్రులు, గణతంత్ర్య దినోత్సవం రోజున కలెక్టర్లు జాతీయ పతాకాన్ని ఎగరవేస్తున్నారు. జిల్లాలో కలెక్టర్ మాధవరావు తొలిసారి జెండాను ఎగుర వేశారు.

– చంద్రశేఖర కల్కూర, సామాజిక వేత్త

ఇద్దరు డీఎస్పీలకు ఇండియన్ పోలీస్ మెడల్స్



శివనారాయణస్వామి, ఏసీబీ డీఎస్పీ; వై.శ్రీనివాసరెడ్డి, డోన్ డీఎస్పీ

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న ఇద్దరు డీఎస్పీలకు ఇండియన్ పోలీస్ మెడల్స్ దక్కాయి. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు జాబితాను ప్రకటించింది. కర్నూలు ఏసీబీ డీఎస్పీ శివనారాయణస్వామి, నంద్యాల జిల్లా డోన్ డీఎస్పీ ఎర్రం శ్రీనివాసరెడ్డిలు సర్వీసులో చేసిన విశిష్టమైన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్ ప్రదానం చేయనుంది. ఈ ఏడాది ఆగస్టు 15న వీరు ఈ అవార్డును అందుకోనున్నారు.

అద్భుతమైన విజయాలు...

1996లో ఎస్‌ఐగా పోలీసు శాఖలో చేరిన శివనారాయణస్వామి వృత్తిపరంగా అనేక విజయాలను సొంతం చేసుకున్నారు. మూడుసార్లు మెరిటోరియస్ సర్వీస్ ఎంట్రీ అవార్డును దక్కించుకున్నారు. అనంతపురంలో సీఐగా పనిచేస్తున్న సమయంలో 42 చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితులైన అంతర్ రాష్ట్ర ముఠాను పట్టుకుని రాష్ట్రస్థాయి గుర్తింపు దక్కించుకున్నారు. అప్పటి డీజీపీ నండూరి సాంబశివరావు చేతుల మీదుగా అవార్డు ఫర్ బెస్ట్ క్రైం డిటెక్షన్(ఏబీసీడీ)ని అందుకున్నారు. 2018లో అనంతపురంలో జరిగిన బ్యాంకు రాబరీ కేసు దర్యాప్తులో కీలకపాత్ర పోషించి చిన్నపాటి ఆధారాలతో అంతర్‌రాష్ట్ర బ్యాంకు దోపిడీ ముఠాను పట్టుకున్నారు. రూ.10.30 లక్షలు, ఒక కారు రికవరీ చేశారు. ఈ కేసులో కూడా శివనారాయణస్వామికి అప్పటి హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప నుంచి ఏబీసీడీ అవార్డు దక్కింది. రూ.39 లక్షల బ్యాంకు రాబరీ చేసిన ముఠాను అరెస్టు చేయడంతో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించిన శివనారాయణస్వామికి అవార్డ్ ఆఫ్ యూనియన్ హోమ్ మినిస్టర్స్ మెడల్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్ అవార్డును అందుకున్నారు.

- అలాగే ప్రకాశం జిల్లాకు చెందిన డోన్ డీఎస్పీ యర్రం శ్రీనివాసరెడ్డి 1989లో ఎస్‌ఐగా పోలీసు శాఖలో చేరారు. నెల్లూరు, గుంటూరు, కడప జిల్లాల్లో పనిచేశారు. 2014లో డీఎస్పీగా పదోన్నతి పొంది ఐదు సంవత్సరాల పాటు ఒంగోలు పోలీసు శిక్షణ కేంద్రంలో, తుల్లూరు(విజయవాడ సెంట్రల్ డివిజన్) సబ్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పనిచేశారు. ఒకటిన్నర సంవత్సరాలుగా డోన్ డీఎస్పీగా పనిచేస్తున్నారు. మొత్తం సర్వీసులో చేసిన విశిష్టమైన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఈయనకు ఇండియన్ పోలీస్ మెడల్ ప్రదానం చేయనుంది.

జిల్లా వాసికి రాష్ట్రపతి పోలీస్ మెడల్



డాక్టర్ జి.వి.సందీప్ చక్రవర్తి

జమ్మూ కశ్మీర్ రాష్ట్రం కుల్గామ్ ఎస్పీ డాక్టర్ జి.వి.సందీప్ చక్రవర్తికి రాష్ట్రపతి పోలీస్ మెడల్ దక్కింది. ఈయన కర్నూలు నగరవాసి. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో జరిగే పెరేడ్‌లో అవార్డును అందుకోనున్నారు. తన ఎనిమిది సంవత్సరాల సర్వీసులో సందీప్ చక్రవర్తి 4వ సారి రాష్ట్రపతి గ్యాలెంట్రీ అవార్డుకు ఎంపికవడం విశేషం. ఈయన తండ్రి డాక్టర్ జి.వి.రాంగోపాల్ రావు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆర్‌ఎంఓగా పనిచేసి పదవీ విరమణ పొందగా.. తల్లి పి.సి.రంగమ్మ వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తూ పదవీ విరమణ పొందారు. సందీప్ చక్రవర్తి 2014 యూపీఎస్‌సీలో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. జమ్మూకశ్మీర్ రాష్ట్రం పూంచీ, యూరి, సోపూర్, బారాముల్లా, శ్రీనగర్, హంద్‌వారా, కుప్‌వారా ప్రాంతాల్లో పనిచేశారు. ప్రస్తుతం కుల్గామ్ జిల్లాలో ఎస్పీగా పనిచేస్తున్నారు. గతంలో మూడుసార్లు ప్రెసిడెంట్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన ఆయన జమ్మూకశ్మీర్ పోలీస్ మెడల్‌కు మూడుసార్లు, చీఫ్ ఆఫ్ ఆర్మీ మెడల్ ఒకసారి, కమెండేషన్ కార్డ్ ఆఫ్ జీవోసీ ఒకసారి, నార్థన్ కమాండ్, సీఆర్‌పీఎఫ్, డీజీపీ కమెండేషన్ కార్డ్ మూడుసార్లు, జమ్మూకాశ్మీర్ డీజీపీ కమెండేషన్ కార్డ్ ఒకసారి అందుకున్నారు.

కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

- పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు: కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నేరస్తులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం డీఎస్పీ స్థాయి అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 364 ముఖ్యమైన కేసులలో దర్యాప్తులు మొదలు పెట్టినప్పటి నుంచి కేసులు పూర్తయ్యేంత వరకు ఎదురయ్యే సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తీవ్రమైన కేసుల్లో ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా చూడాలన్నారు. చార్జిషీట్‌లు ఫైల్ చేసేటప్పుడు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేసుల పరిశోధన పురోగతిని వేగవంతం చేయాలని, సాక్షులను సరైన సమయాల్లో కోర్టుకు హాజరుపరచాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ డి.ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ అజకల్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు వెంకటాద్రి, వెంకటరామయ్య, యుగంధర్ బాబు, వినోద్ కుమార్, నాగభూషణం, కేవీ మహేష్, కోర్టు మానిటరింగ్ సీఐ రామయ్య నాయుడు, డీసీఆర్‌బీ సీఐ గుణ శేఖర్ బాబు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఓటు రాజ్యాంగం ఇచ్చిన హక్కు

- 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి
- జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్ కోటేశ్వరరావు



యువ ఓటరును సన్మానిస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఓటు రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఆర్‌డీఓ హరిప్రసాదు హాజరయ్యాయరు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులు జాతీయ గీతాన్ని ఆలపించగా, వేడుకలకు హాజరైన వారికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్‌కుమార్ వీడియో సందేశాన్ని వినిపించారు.వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు వేస్తానన్న సందేశంతో అధికారులు, యువకులు, విద్యార్థులు, మహిళలు, దివ్యాంగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..దేశ భవిష్యత్‌ను తీర్చి దిద్దగల నాయకులను ఓటు ద్వారానే ఎన్నుకోవచ్చన్నారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఓటర్లకు సన్మానం చేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఇటీవల స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో ఉత్తమ సేవలు అందించిన జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరారవు, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్, కర్నూలు అర్బన్ తహశీల్దార్ విజయశ్రీ, కల్లూరు తహసీల్దార్లను కలెక్టర్‌సన్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సెట్కూరు సీఈఓ రమణ, విభిన్నప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు విజయ, గూడూరు తహశీల్దార్ శివరాముడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.



గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నుంచి అవార్డు అందుకుంటున్న భార్గవ్ తేజ

కమిషనర్ భారవ్‌తేజకు ఉత్తమ ఈఆర్ఓ అవార్డు

కర్నూలు (టౌన్): ఉత్తమ ఈఆర్ఓ (ఎలక్ట్రోరోల్ రోలింగ్ ఆఫీసర్) అవార్డుకు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఎంపికయ్యారు. బుధవారం జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని విజయవాడలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా కమిషనర్ ఈ అవార్డును అందుకున్నారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ఓటరు నమోదు ప్రక్రియలో ఉత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డు దక్కించుకున్నారు. నగరపాలకకు చెందిన ఇతర విభాగాల అధికారులు అవార్డు గ్రహీత కమిషనర్‌కు అభినందనలు తెలియజేశారు.

క్లుప్తంగా

ఒకే ఈతలో ఐదు మేక పిల్లలు



కోవెలకుంట్ల: సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన కాకరవాడ ఉస్సేన్‌కు చెందిన మేక బుధవారం ఒకే ఈతలో ఐదు మేక పిల్లలను ఈనింది. ఉస్సేన్ మేకల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నాడు. మందలోని ఒక మేక ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. తల్లితో పాటు మేక పిల్లలు ఆరోగ్యంగా ఉన్నట్లు యజమాని పేర్కొన్నాడు. మేకలో జన్యు సంబంధ కారణాలతో ఇలాంటి అరుదైన సంఘటనలు చోటు చేసుకుంటాయని పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కర్నూలు: నగర పరిధిలోని బుధవారపేటకు చెందిన ఉష (28) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమెకు లోకనాథ్‌రెడ్డితో కొన్నేళ్ల క్రితం వివాహమయ్యింది. కొడుకు, కూతురు సంతానం. కుటుంబ కలహాల కారణంగా ఐదేళ్ల క్రితం భర్తతో విడిపోయి బుధవారపేటలో వేరుగా కాపురముంటోంది. బుధవారం మధ్యాహ్నం డబ్బు విషయంలో తల్లి సువర్ణమ్మ, సోదరుడు వెంకటేశ్వర్లుతో గొడవపడి తీవ్ర మనస్తాపానికి గురై కొద్దిసేపు తర్వాత ఇంట్లో తాడుతో ఉరి వేసుకుంది. సమీపంలోనే నివాసముంటున్న సోదరి సురేఖ గుర్తించి ఇరుగుపొరుగు సాయంతో ఉషను ఉరి నుంచి తప్పించింది. అయితే అప్పటికే ఆమె మృతి చెందడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మూడవ పట్టణ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

చిరుత కళేబరం లభ్యం?



చిరుతపులిదిగా అనుమానిస్తున్న కళేబరం

వెల్దుర్తి: యాపర్లపాడు ఫారెస్ట్ బీట్ పరిధిలో కొండగుట్టల వద్ద బుధవారం చిరుత అనవాళ్లతో కళేబరం లభ్యమైంది. గొర్రెల కాపరులు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, వెల్దుర్తి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శకుంతలమ్మతో కలిసి సంఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. కళేబరం సగానికిపైగా కుళ్లిపోయి ఉందని, చిరుతదా కాదా అన్నది గురువారం తేలనున్నట్లు ఎస్ఐ, ఎఫ్‌బీఓ తెలిపారు.

కిక్కు వదలకపోతే చిక్కే!

సరదాగా మొదలయ్యే మద్యపానం వ్యసనంగా మారి జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తోంది. చివరకు శరీరంలోని పలు అవయవాలను పాడు చేసి ప్రాణాలు తీస్తోంది. మితంగా తీసుకుంటే ఏమీ కాదులే అనుకుంటే భ్రమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది.

- మద్యపానంతో కాలేయం, క్లోమం గుల్ల
- పెద్దాసుపత్రికి వచ్చే కేసుల్లో 50 శాతం ఇవే
- ఏటా 400 దాకా కాలేయం, 200 దాకా క్లోమగ్రంథి కేసులు
- మద్యం జోలికి వెళ్లొద్దంటున్న వైద్యులు



కర్నూలు పెద్దాసుపత్రిలో జీర్ణకోశ, కాలేయ వ్యాధుల విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జీర్ణకోశవ్యాధుల విభాగం (గ్యాస్ట్రో ఎంట్రాలజి)కు చికిత్స కోసం వచ్చే వారిలో 50 శాతం వరకు ఆల్కహాలు బాధితులే. 2018లో 247 మంది పాంక్రియాటిక్ సమస్యలతో వార్డులో చేరగా అందులో 251 మంది ఆల్కహాలు కారణంగా పాంక్రియాటిక్ (క్లోమగ్రంథి) దెబ్బతిన్నవారున్నారు. అలాగే 2019లో 293 మందికి గాను 178 మంది, 2020లో 119 మందికి గాను 57 మంది, 2021లో 266 మందికి గాను 29 మంది, 2022లో 319 మందికి గాను 151 మంది పాంక్రియాటిస్ దెబ్బతిని చికిత్స కోసం వచ్చారు. వీరితో పాటు కాలేయం దెబ్బతిన్న వారూ అధికంగా ఉన్నారు. 2018లో కాలేయ సమస్యతో ఆసుపత్రిలో చేరిన 497 మందిలో 251 మంది ఆల్కహాలు బాధితులే. అలాగే 2019లో 577 మందిలో 254 మంది, 2020లో 224 మందిలో 131 మంది, 2021లో 475 మందిలో 312 మంది, 2022లో 722 మందిలో 446 మందికి ఆల్కహాలు కారణంగా కాలేయం దెబ్బతిన్నట్లు వైద్యులు గుర్తించి చికిత్స చేశారు. ప్రతిరోజూ, దీర్ఘకాలం అధిక మోతాదులో మద్యం సేవించడం ద్వారా కాలేయం దెబ్బతిని అది క్రమంగా లివర్ సిర్రోసిస్‌కు దారి తీస్తోంది. ఒకసారి సిర్రోసిస్ వచ్చిందంటే ప్రాణాంతకమవుతుంది. గతంలో ఆల్కహాలు సేవనం వల్ల లివర్‌సిర్రోసిస్‌కు గురై ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య 20 శాతం కంటే తక్కువగా ఉండగా ఇప్పుడు 40 శాతానికి మించిందని వైద్యులు చెబుతున్నారు. వీరితో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ మద్యం వ్యసనంతో వివిధ వ్యాధులకు గురై చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య రోజుకు 160 దాకా ఉంటుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు చెబుతున్నారు.

లివర్ సిర్రోసిస్ లక్షణాలు

ప్రొటీన్ లెవెల్స్ తక్కువగా ఉంటే అలసటగా ఉంటుంది. శరీరంతో పాటు కాళ్లలో వాపు వస్తుంది. పొత్తికడుపులో ద్రవాలు పేరుకుంటాయి. ఈ కారణంగా పొత్తికడుపు కూడా వాపు వస్తుంది. కొన్నిసార్లు రక్తంతో కూడిన వాంతి అవుతుంది. మలం కూడా నల్లటి రంగులో వస్తుంది. కళ్లు, మూత్రం ముదురు పచ్చరంగులోకి మారుతాయి.

మద్యపానంతో వచ్చే వ్యాధులు

ఆల్కహాలు తాగడం ద్వారా ముందుగా ఫ్యాటీ లివర్, లివర్ సిర్రోసిస్ వస్తుంది. శరీరంలో కొవ్వు శాతం పెరిగి గుండెజబ్బులకు దారి తీస్తుంది. అధిక రక్తపోటుకు గురిచేస్తుంది. నాడీ మండల వ్యాధులకు గురిచేస్తుంది. నరాలు, కండరాలు పటుత్వాన్ని కోల్పోతాయి. ఎక్కువగా నోరు, అన్నవాహిక, గొంతు, లివర్, పాంక్రియాస్ క్యాన్సర్‌లకూ దారి తీస్తుంది. కడుపులో అల్సర్‌కు దారి తీసి అది ఒక్కోసారి క్యాన్సర్‌గా మారే అవకాశమూ ఉంది. మద్యం తాగడం వల్ల ప్యాంక్రియాస్ జబ్బులు కూడా పెరుగుతున్నాయి. అది మెదడు, గుండెపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయి. అతిగా మద్యం సేవించే వారు క్రమంగా సమాజం నుంచి దూరమవుతారు. ఇన్ని నష్టాలున్న మద్యాన్ని తాగకపోవడమే మేలని వైద్యులు సూచిస్తున్నారు.

లివర్ సిర్రోసిస్‌ను నయం చేయడం కష్టం



ప్రతిరోజూ విస్కీ 90 ఎంఎల్, వైన్ 150 ఎంఎల్, బీర్ 350 ఎంఎల్ తాగే వారిలోనూ ఆల్కహాలిక్ లివర్ డిసీజ్ వస్తుంది. అయితే, కొంతమందిలో మద్యం తాగుతున్నా వారి శరీరంలో కలిగే ఎంజైమ్‌ల మార్పులతో వారికేమీ కాదు. అలాగని మద్యం తాగుతూ ఉండటం మంచిది కాదు. మద్యపానంతో అధికంగా కాలేయం పూర్తిగా దెబ్బతింటుంది. దీనినే లివర్ సిర్రోసిస్ అని అంటారు. దీనిబారిన పడిన వారిని కాపాడటం కష్టం. కొన్నిసార్లు కాలేయ మార్పిడి చేయాల్సి ఉంటుంది.

–డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజి హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

మానేందుకు ఆసుపత్రిలో చికిత్స తీసుకోవాలి



మద్యం మానాలన్న పట్టుదలతో ఉండాలి. పట్టుదల లేకపోతే మళ్లీ మళ్లీ దాని జోలికి వెళ్తారు. మద్యం మానే క్రమంలో మూడు నుంచి ఐదు రోజుల పాటు ఆసుపత్రిలో చేరాలి. ఈ సమయంలో కొన్నిసార్లు ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉంది. కొందరికి షుగర్ డౌన్ అవుతుంది. మరికొందరికి ఆల్కహాలు క్రేవింగ్, సైకోసిస్, డిలీరియం వంటి సమస్యలొస్తాయి. వీటికి చికిత్స ఇస్తూ అలవాటు మాన్పిస్తాం. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక మద్యం తాగే అలవాటున్న స్నేహితులకు దూరంగా మెలగాలి.

–డాక్టర్ పి. అబ్దుల్ సమద్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్ఠం(రూ)	గరిష్ఠం (రూ)
వేరుశెనగ	5,699	8,490
పొద్దుతిరుగుడు	5,129	5,139
ఆముదం	5,500	6,420
కొర్రలు	1,729	1,729
ఉల్లి	657	1,629
ఎండు మిర్చి	6,969	32,505
కందులు	2,000	7,005
మొక్కజొన్న	1,845	2,200
మినుములు	6,119	6,569



ఎల్లెల్సీలో యువకుడి గల్లంతు



ఎల్లెల్సీలో గల్లంతైన రాజశేఖర్‌స్వామి (ఫైల్)

హొళగుంద: నీరు తాగేందుకు వెళ్లిన ఓ యువకుడు కాలు జారి పడి తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన కథనం మేరకు.. హాలహర్వి మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్ స్వామి (27)కి కర్ణాటక రాష్ట్రం సూగూరుకు చెందిన ఈరమ్మతో వివాహమైంది. ఏడాది నుంచి భార్య ఊరు సూగూరులో వారు నివాసం ఉంటున్నారు. బుధవారం తన తల్లి సుమంగళమ్మ, మామ పంపాపతితో కలిసి సిద్ధాపురంలో తన అవ్వ దినకర్మ చేసేందుకు రాజశేఖర్ స్వామి వచ్చారు. కార్యక్రమం ముగించుకుని మోటార్‌సైకిల్‌పై ముగ్గురూ సూగూరుకు బయలుదేరారు. హొళగుంద సమీపంలో తుంగభద్ర దిగువ కాలువలో నీరు తాగేందుకు దిగిన రాజశేఖర్‌స్వామి కాలు జారి కొట్టుకు పోసాగాడు. అతడిని కాపాడేందుకు తల్లి కూడా కాలువలో దిగి కొట్టుకుపోతుండగా.. యువకుడి మామ పంపాపతి వెంటనే దూకి ఆమెను కాపాడాడు. ఈలోపు యువకుడు కాలువలో కొట్టుకుపోయాడు. అతని ఆచూకీ కోసం బంధువులు కాలువ వెంబడి గాలిస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్.. మహిళ మృతి



మృతి చెందిన లింగమ్మ

కౌతాళం: ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపిన వివరాల మేరకు మంగళవారం ఉదయం అగసలదిన్నె గ్రామం నుంచి 25 మంది పని నిమిత్తం ఉప్పరహాల్‌కు వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం తిరిగి ఆటోలో వస్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ సైడ్‌కు ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ పక్కనే కూర్చున్న లింగమ్మ (36) కిందపడి తీవ్రంగా గాయపడింది. ఆటోలో ఉన్న వారందరూ సురక్షితంగా బయటపడ్డారు. లింగమ్మను చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించగా మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త పామన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పెద్దాసుపత్రిలో గోడకూలి వ్యక్తికి గాయాలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బాల్కనీ గోడ కూలి ఓ వ్యక్తి గాయపడ్డాడు. నంద్యాల జిల్లా రేగడగూడూరుకు చెందిన రెహమాన్ తన కూతురు హనీఫా(1)కు కాలిన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని బర్న్స్ వార్డులో చేర్చారు. ఆసుపత్రిలో నూతన భవనాల నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఆ వార్డును పేయింగ్‌బ్లాక్‌కు మార్చారు. పాపను ఎండలో ఉంచితే త్వరగా నయం అవుతుందని భావించి బుధవారం ఉదయం రెహమాన్ పాపను ఎత్తుకుని బాల్కనిలో గోడకు ఆనుకుని నిలబడ్డాడు. అప్పటికే గోడ పాతదై ఉండటం, అతని బరువంతా దానిపై వేయడంతో గోడకూలిపోయింది. దీంతో రెహమాన్‌తో పాటు అతని కూతురూ కిందపడ్డారు. ప్రమాదంలో పాపకు గాయాలేమీ కాలేదు. రెహమాన్ స్వల్ప గాయాలతో క్యాజువాలిటిలో చికిత్స పొందుతున్నారు. కాగా గోడకూలి గాయపడిన రెహమాన్‌కు రూ.5లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహమ్మద్ షరీఫ్, కె.రామకృష్ణలు డిమాండ్ చేశారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని, ఆసుపత్రిలో పురాతన భవనాలను కూల్చి కొత్త భవనాలను నిర్మించాలని కోరారు.

నేడు పనిచేయనున్న విద్యుత్ బిల్లుల కేంద్రాలు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు గురువారం కూడా పనిచేస్తాయని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణతంత్ర దినోత్సవ సెలవు రోజు అయినా వినియోగదారుల సౌకర్యార్థం కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని బిల్లు వసూలు కేంద్రాలు తెరిచే ఉంటాయన్నారు.

మార్చి నాటికి అన్ని ఆర్‌బీకేల్లో సీహెచ్‌సీలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు, ఏఓలు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రాలన్నింటిలో రైతులకు యాంత్రీకరణ పరికరాలు అందుబాటులో ఉండేందుకు కస్టమ్ హయరింగ్ సెంటర్ల ఏర్పాటుపై సత్వరం దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ జిల్లా వ్యవసాయాధికారిని ఆదేశించారు. ప్రతి ఆర్‌బీకే పరిధిలో సీహెచ్‌సీ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశమని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రబీ పంటల నమోదు, యాంత్రీకరణ, వ్యవసాయ యంత్రాంగం పనితీరు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్ల రేట్లు ఖరారు అయ్యాయని, మిగిలిన యంత్ర పరికరాల ధరలను కూడా జిల్లా స్థాయిలోనే జేసీ ఆధ్వర్యంలోని కమిటీలు ఖరారు చేయడంతో సీహెచ్‌సీల ఏర్పాటు దిశగా తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. మార్చి నెల మొదటి వారంలోపు సీహెచ్‌సీలను గ్రౌండింగ్ చేయాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి సబ్సిడీలు విడుదల చేస్తారని తెలిపారు. రబీ పంటల నమోదు ప్రక్రియను ఫిబ్రవరి 20 నాటికి పూర్తి చేయాలన్నారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, గిరీష్, మహమ్మద్‌ఖాద్రీ, సునీత, అగ్రానమీ ఏడీఏ బాలవర్ధిరాజు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వస్తువుల నాణ్యతపై రాజీ పడొద్దు

- బీఐఎస్ జేడీలు సుజాత, రమాకాంత్ సాగర్





మాట్లాడుతున్న బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ సుజాత, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్):వస్తువుల నాణ్యతపై రాజీ పడొద్దని, కచ్చితంగా బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) కలిగి ఉంటేనే విక్రయించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఉన్నతాధికారులకు బీఐఎస్ జాయింట్ డైరెక్టర్లు సుజాత, రమాకాంత్ సాగర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ ఆహార పదార్థాలు, వినియోగించే రకరకాల వస్తువుల బీఐఎస్ మార్కును ఎలా కనుగొనాలో విశదీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజలు కొనుగోలు చేసే వస్తువు లు, సరుకుల్లో నిర్దేశిత ప్రమాణాలు లేకపోతే చర్యలు తీసుకోవాలన్నారు.పౌర సరఫరాల శాఖ అధికారి రాజారఘువీర్ మాట్లాడుతూ..వస్తువుకొనుగోలు చేసే సమయంలో కచ్చితంగా బిల్లును పొందాలన్నారు. కార్యక్రమంలో పీఆర్, విద్యా, శిశు సంక్షేమ, వైద్యారోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

జ్ఞాన స్వరూపిణీ.. నమోస్తుతే!

- నేడు వసంత పంచమి
- అక్షరాభ్యాసానికి పవిత్రమైన రోజు
- కొలనుభారతి, నన్నూరు సరస్వతీ దేవి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు



కొలను భారతిలో వసంత పంచమి వేడుకలకు ఏర్పాట్లు





కొలను భారతిలో కొలువుదీరిన సరస్వతీ దేవి, చారుఘోషిణి కొలను

కర్నూలు కల్చరల్: మాఘ మాసం శుక్ల పక్షంలో వచ్చే 'పంచమి'ని శ్రీపంచమి, వసంత పంచమి, సరస్వతి జయంతి, మదన పంచమి పేర్లతో పిలుస్తా రు. ఎంతో శుభకరమైన ఈ పంచమి గురించి దేవీ భాగవతం, బ్రహ్మాండ పురాణంలో వివరించారు. సకల విద్యా స్వరూపిణి సరస్వతి జన్మదినంగా మాఘ శుద్ధ పంచమి నాడు జరుపుకుంటారు. ప్రకృతిలో జరిగే మార్పులకు సూచనగా మనకు కొన్ని పండుగలు ఏర్పడ్డాయి. అలాంటి వాటిలో శ్రీ పంచమి ఒకటి. ఇది రుతు సంబంధమైన పర్వం. వసంత రుతువుకి స్వాగతం పలికే పండుగగా శాస్త్రాలతో పేర్కొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసాలు

వసంత పంచమి రోజు అమ్మవారిని తలుచుకుంటే శుభం కలుగుతుందని పెద్దలు చెబుతారు. వాగేశ్వరి, మహా సరస్వతి, సిద్ధ సరస్వతి, నీల సరస్వతి, ధారణ సరస్వతి, పరాసరస్వతి, బాలా సరస్వతి, వాగ్దేవి సరస్వతిని 'సామంపాతు సరస్వతి' అనే మకుటంతో ఉన్న శ్లోకాలతో ధ్యానం చేస్తే శారదా దేవి అపార జ్ఞాన రాశి ప్రసాదిస్తుందని పండితులు చెబుతారు. ఈ పండుగను ఉత్తర భారత దేశంలో విశేషంగా జరుపుకుంటారు. ఈరోజు లక్ష్మీదేవిని, రతీ మన్మథులను పూజించి, దానాలు చేయడం వల్ల మాధవుడు (వసంతుడు) సంతోషిస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి. జిల్లాలో కొలను భారతి సరస్వతీ ఆలయం, నన్నూరు సమీపం రాగమయూరిలోని సరస్వతీ ఆలయాల్లో వసంత పంచమి వేడుకలు నిర్వహించడంతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయిస్తారు.


ప్రసిద్ధి చెందిన కొలను భారతి క్షేత్రం

కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. నల్లమల అభయారణ్యంలో వెలసిన ఈ క్షేత్రాన్ని 11వ శతాబ్దంలో చాళుక్యులు నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. తెలుగు రాష్ట్రా ల్లో బాసర తరువాత రెండో ఆలయం ఇది ప్రసిద్ధి చెందింది. అమ్మవారు స్వయంభువుగా ఇక్కడ వెలిసిన ట్లు పురాణాలు చెబుతున్నాయి. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఈ క్షేత్రంలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. ఆలయం సమీపంలో చారు ఘోషిణి నది ప్రవహిస్తూ ఆహ్లాదాన్ని పంచుతుంది. కొత్తపల్లి మండలం శివపురం గ్రామం సమీపంలో ప్రకృతి ఒడిలో వెలిసిన ఈ క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు ఏటా నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల ప్రజలే కాకుండా తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర ప్రాంతాల ప్రజలు ఇక్కడికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుంటారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

కొలను భారతీ దేవి ఆలయంలో గురువారం ఉదయం 5.30 గంటలకు శ్రీశైలం శ్రీభమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం వారు పట్టువస్త్రాలను సమర్పిస్తారు. అనంతరం సరస్వతీదేవికి అలంకరణ, మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన, పుష్పార్చన, మహా మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయి. చిన్నారులకు అక్షరాభ్యాసం, బీజాక్షర కార్యక్రమాలు జరుగుతాయి. – మోహన్, కొలను భారతి క్షేత్రం ఈఓ

అత్యంత శుభప్రదం



నన్నూరు సమీపంలోని రాగమయూరి సరస్వతీ దేవి ఆలయంలో 13 సంవత్సరాల నుంచి వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తున్నాం. గురువారం తెల్లవారు జామునుంచే అమ్మవారికి అభిషేకం, తిరుమంజనం నిర్వహిస్తాం. ఆలయంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు జరుగుతాయి. సరస్వతీ దేవి ఆరాధనకు శ్రీ పంచమి శ్రేష్టమైన రోజు. – మామిళ్ల పల్లె యశోధరకుమార శర్మ